సాక్షి
అనంతపురం
గురువారం। 12। జనవరి। 2023



'అనంత' స్ఫూర్తిమంత్రం

స్వామి వివేకానంద స్ఫూర్తితో 'అనంత' యువత సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో సత్తా చాటుతోంది. 8లో



టమాట కిలో రూ.16

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టం రూ.16, కనిష్ట ధర రూ.3 ప్రకారం పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
31.9°/08.5°

జిల్లా అంతటా బుధవారం చలితీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు లేదు. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి.

న్యూస్‌రీల్

మహా సంకల్పం

- బెంగళూరు నుంచి బాదామికి మీనా అయ్యర్ సైకిల్ యాత్ర



సైక్లిస్ట్ మీనా అయ్యర్

కళ్యాణదుర్గం: బెంగళూరుకు చెందిన సైక్లిస్ట్ మీనా అయ్యర్ వయసు 50 సంవత్సరాలు. ఈమెకు ఇద్దరు కుమారులు. వీరు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. మీనా అయ్యర్ స్వస్థలంలోనే ఒంటరిగా ఉంటున్నారు. ఒంటరితనం నుంచి బయట పడేందుకు సైకిల్‌పై దేశాన్ని చుట్టేయాలని సంకల్పించుకున్నారు. తన నిర్ణయాన్ని స్నేహితురాలు లక్ష్మితో వెల్లడించారు. మంచి నిర్ణయమని ఆమె సమర్థించడంతో యాత్రకు ఉపక్రమించారు ఇందుకోసం మీనా అయ్యర్ అమెరికా నుంచి రూ.3లక్షలు వెచ్చించి సైకిల్ తెప్పించుకున్నారు. రెండేళ్ల క్రితం హిమాచల్ ప్రదేశ్ వరకు యాత్ర సాగించారు. తాజాగా ఈ నెల ఎనిమిదో తేదీన బెంగళూరు నుంచి బళ్లారి, హంపి మీదుగా బాదామి ప్రాంతానికి 452 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టారు. బుధవారం కళ్యాణదుర్గం చేరుకున్న ఆమె మీడియాతో ముచ్చటించారు. సైకిల్ తొక్కడం ఎంతో ఇష్టమని, దేశవ్యాప్తంగా పర్యటించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. తన పర్యటనలో వివిధ రాష్ట్రాల ప్రజలు తమ సంప్రదాయాలతో స్వాగతం పలికి.. ఆప్యాయంగా పలకరిస్తున్నారని మీనా అయ్యర్ సంతోషం వ్యక్తం చేశారు.

అతిశీతలంతో అతలాకుతలం



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అతిశీతల వాతావరణం నెలకొంది. నాలుగు రోజులుగా చలిపులి పంజా విసురుతోంది. చాలా మండలాల్లో పది డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రధానంగా మడకశిర, హిందూపురం, కదిరి, ఉరవకొండ, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో చలితీవ్రత అధికంగా ఉంది. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా అగళిలో 7.7 డిగ్రీలు, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 8.5 డిగ్రీల కనిష్టం నమోదు కావడం విశేషం. ఇక మడకశిర 7.8 డిగ్రీలు, సోమందేపల్లి 8.3, నల్లచెరువు 8.6, తనకల్లు 8.8, అమడగూరు, శెట్టూరు 9.1, రొద్దం 9.3, లేపాక్షి 9.4, హిందూపురం 9.5, ఓడీ చెరువు 9.6, కంబదూరు, కొత్తచెరువు, గుమ్మఘట్ట 10, కుందుర్పి 10.1, నల్లమాడ 10.3, తలుపుల 10.5, తాడిమర్రి 10.6, విడపనకల్లు 10.8, గోరంట్ల 10.9 డిగ్రీల మేర కనిష్టం నమోదు కాగా మిగతా మండలాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27 నుంచి 32 డిగ్రీల మధ్య కొనసాగాయి.

అన్న మరణం జీర్ణించుకోలేక తమ్ముడి ఆత్మహత్య



మృతుడు రంగస్వామి

పామిడి: అన్న మరణం జీర్ణించుకోలేక తమ్ముడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పామిడి మండలంలో జరిగింది. ఏఎస్‌ఐ ఇబ్రహీం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.కొండాపురం గ్రామానికి చెందిన పాల నేసే రంగయ్య, అంజనమ్మ దంపతులు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. రెండో కుమారుడు సుధాకర్ తన కుమారుడు మానసిక సమస్యతో బాధపడుతుండటంతో మనస్తాపం చెంది ఐదు రోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం అన్న దినం కావడంతో రంగస్వామి (26) తన తండ్రి రంగయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై పామిడికి వెళ్లి అవసరమైన సరుకులు కొనుగోలు చేశారు. తండ్రిని కొట్టాల ప్రాంతంలో వదిలి.. తాను పి.కొండాపురంలోని నివాసానికి వెళ్లాడు. అన్నను తలచుకుని ఉద్వేగానికి లోనయ్యాడు. కొద్దిసేపటి తర్వాత బహిర్భూమికని ఇంట్లో చెప్పి బయటకు వచ్చి కొండాపురం రోడ్డులోని దళితవాడ క్రాస్ వద్ద గల నీటిగుంతలో దూకాడు. చుట్టుపక్కల వారు గమనించి నీటిలో దిగి రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే రంగస్వామి ప్రాణం విడిచాడు. అనంతరం మృతదేహాన్ని పోలీసుల సమక్షంలో బయటకు తీసి పోస్టుమార్టానికి పంపారు. రంగస్వామికి భార్య సునిత, కుమారుడు రాజేష్ ఉన్నారు. ఏఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

అభినందన మరచి..

అభాండమా..?



- టీడీపీ నేత కాలవ శ్రీనివాసులు తీరుపై పోలీసు వర్గాల విస్మయం
- శ్రమ వృథా చేయొద్దంటూ హితవు
- అభినందించాల్సింది పోయి రాజకీయ స్వార్థంతో వ్యవహరించడంపై మండిపాటు



అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, ఇతర సామగ్రిని చూపుతున్న ఎస్పీ ఫక్కీరప్ప (ఫైల్)

రాయదుర్గం: రాజకీయాలు ఎప్పుడూ హుందాగా, నిర్మాణాత్మకంగా ఉండాలి. ప్రజాశ్రేయస్సుకు, వ్యవస్థల పనితీరుకు దోహదపడాలి. నేతలు హుందాగా వ్యవహరించినప్పుడే అది సాధ్యపడుతుంది. కానీ ప్రతిపక్ష నేతలు రాజకీయ కట్టుబాట్లు పాటించడం లేదు. మరీ ముఖ్యంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు వ్యవహారశైలి పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉంటోంది. నిక్కచ్చిగా పనిచేస్తూ జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్న పోలీసులను అభినందించాల్సింది పోయి.. వారికి రాజకీయ దురుద్దేశాలను అంటగడుతున్నారు. ఇటీవల జిల్లా పోలీసులు అంతర్రాష్ట్ర నకిలీ కరెన్సీ చెలామణి, ఆయుధాల సరఫరా ముఠాను అరెస్టు చేసిన విషయం విదితమే. దేశవ్యాప్త నెట్‌వర్క్ కల్గిన ఈ ముఠా ఆట కట్టించడానికి పోలీసులు ఎంతగానో శ్రమించారు. కానీ వారి శ్రమను వృథా చేసేలా కాలవ వ్యాఖ్యలు చేశారు. ముఠా సభ్యుల్లో ఒకరితో అధికార పార్టీ నేతలకు సంబంధం ఉందంటూ నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా కేసు దర్యాప్తులో పోలీసులకు ఆటంకాలు సృష్టించేలా వ్యవహరించారు. ఆయన వ్యాఖ్యలను పోలీసు అధికారులు నేరుగా ఖండించాల్సిన పరిస్థితులను కల్పించారు. ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి..రాజకీయ ప్రయోజనాల కోసం పోలీసు వ్యవస్థపై ఆరోపణలు చేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

సమర్థతకు నిదర్శనాలెన్నో..

జిల్లా పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందనడానికి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. సెల్‌ఫోన్ల రికవరీలో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లాను అగ్రస్థానంలో నిలిపారు. 'చాట్‌బాట్' సేవల ద్వారా గతే ఏడాది ఆఖరు వరకు సుమారు రూ.7 కోట్లు విలువ చేసే 4,294 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. 2021–22 మధ్యకాలంలో మత్తుపదార్థాలు, పేకాట, మట్కా, గుట్కా, బెట్టింగ్ తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారు. ఒక్క జూదాలపైనే 5,236 కేసులు నమోదు చేశారంటే పోలీసు వ్యవస్థ సమర్థతను అర్థం చేసుకోవచ్చు. నకిలీ ఎన్‌ఓసీలు, ఆధార్‌కార్డుల మార్ఫింగ్, రియల్ ఎస్టేట్ దందాల ముఠాల ఆట కట్టించారు. ఈ కేసుల్లో పలువుర్ని అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపించారు.

డీజీపీ నుంచి ప్రశంసలు

ఆయుధాల సరఫరా ముఠా అరెస్టులో 'అనంత' పోలీసులు చూపిన తెగువను స్వయాన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశంసించారు. ఈ ముఠా సభ్యులకు నకిలీనోట్ల చెలామణి మొదలుకుని..గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, కిరాయి హత్యలు తదితర వాటితో సంబంధాలు ఉన్నాయి. ఈ అంతర్రాష్ట్ర ముఠాలోని ఆరుగురు సభ్యులను గత డిసెంబరులో అరెస్టు చేసిన జిల్లా పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టి ఆయుధ నెట్‌వర్క్ మూలాలను గుర్తించారు. ముఠా సభ్యుల్లో కీలకమైన మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్‌పాల్‌సింగ్ ఆ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఆయుధాల తయారీ కేంద్రాలపైనా దాడులు నిర్వహించారు. కొత్త ప్రాంతాల్లో, అది కూడా ఆయుధ ముఠా కేంద్రాలపై దాడులు చేయడమంటే ఆషామాషీ కాదు. అయినప్పటికీ జిల్లా పోలీసులు ప్రాణాలకు సైతం తెగించి దాడులు చేసి..ఆయుధాలను, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇంతటి ధైర్యసాహసాలను ప్రదర్శించిన పోలీసులను ఉన్నతాధికారులతో పాటు పలువురు అభినందించగా.. టీడీపీ నేత కాలవ శ్రీనివాసులు మాత్రం వారి శ్రమను తక్కువ చేసేలా మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలు పోలీసు వర్గాలను విస్మయానికి, వేదనకు గురి చేశాయి.

కాలవ తీరు హేయం



జిల్లా పోలీసులు ప్రాణాలకు సైతం తెగించి ఆయుధ ముఠాను పట్టుకున్నారు. వారి శ్రమను గుర్తించాల్సింది పోయి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అభాండాలు వేయడం హేయమైన చర్య. స్వార్థ రాజకీయాల కోసం కేసునే తప్పుదారి పట్టించేలా మాట్లాడటం పద్ధతిగా లేదు.

– బీటీపీ గోవిందు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు

ఎక్కడా రాజీ పడలేదు



అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల ఆట కట్టించడానికి డీజీ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సుదీర్ఘంగా ఆపరేషన్ చేశాం. ఈ ముఠాలో కరుడుగట్టిన నేరగాళ్లు ఉన్నా ధైర్యంగా అరెస్టు చేశాం. కేసు దర్యాప్తులో ఎక్కడా రాజీపడలేదు. ఈ కేసు విషయంలో అనవసరమైన ఆరోపణలు చేయడం తగదు.

– డాక్టర్ ఫక్కీరప్ప, ఎస్పీ

సంబంధం లేని అంశాలను తేవొద్దు



జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప ఆధ్వర్యంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నాం. ఆయుధ ముఠాను పట్టుకోవడంలో మన పోలీసులు చూపిన ప్రతిభ రాష్ట్రానికే తలమానికం. డీజీపీ నుంచి రివార్డు అందుకోవడం గర్వంగా ఉంది. దర్యాప్తుతో సంబంధం లేని అంశాలను ప్రస్తావించడం మంచిపద్ధతి కాదు.

– బి.శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ఎన్‌ఐఏకు ఆయుధ ముఠా కేసు?

రాయదుర్గం: నకిలీ కరెన్సీ, ఆయుధాలు సరఫరా చేస్తూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర ముఠా కేసు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ)కి బదిలీ చేసే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన నివేదికలు కూడా పోలీసు అధికారులు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే ఈ కేసును ఎన్‌ఐఏకి బదిలీ చేసే అవకాశముంది. ముఠా సభ్యులు జైళ్లలో ఉన్న సమయంలో తీవ్రవాదుల కుటుంబ సభ్యులతో పరిచయాలు ఏర్పరుచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. తద్వారా వారు తీవ్రవాదులకు ఏవిధంగానైనా సహకారం అందించారా? దేశ భద్రతకు భంగం వాటిల్లే చర్యలకు ఏమైనా ఒడిగట్టారా? తదితర అంశాలను నిగ్గుతేల్చేందుకు ఎన్‌ఐఏకి అప్పగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా పోలీసులు గత డిసెంబరులో అరెస్టు చేసిన ముఠాలోని ఆరుగురు సభ్యులూ కరుడుగట్టిన నేరస్తులే. కర్ణాటక రాష్ట్రానికి చెందిన జంషీద్, ముబారక్, అమీర్ పాషా, గోవాకు చెందిన రియాజ్ షేక్, మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్ పాల్ సింగ్ జునేజా అలియాస్ చోటు, చున్నిలాల్ నన్ను సుతార్ ఆదివాసీలను పోలీసులు ఏడు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారణ చేశారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెలుగు చూశాయి. అక్రమ ఆయుధాల తయారీ, సరఫరాలో రాజ్‌పాల్ సింగ్ జునేజా అలియాస్ చోటు కీలక సూత్రధారిగా గుర్తించారు. ఇతను మధ్యప్రదేశ్ రాష్ట్రం బర్వాణి జిల్లా వర్ల తాహసీల్ ఉమర్తి గ్రామానికి చెందినవాడు. మధ్యప్రదేశ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో తొమ్మిది అక్రమ ఆయుధాల తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తేలింది. పలు రాష్ట్రాల్లోని ముఠాలకు ఆయుధాలను సరఫరా చేసినట్లు గుర్తించారు. దీంతో పాటు మాదక ద్రవ్యాలను కూడా విక్రయించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో ముఠాకు తీవ్రవాదులతో సంబంధాలపై నిగ్గు తేల్చేందుకు కేసును ఎన్‌ఐఏకి బదిలీ చేసే అవకాశముంది. అవసరమైతే ఎన్‌ఐఏకి బదిలీ చేస్తామని ఈ నెల ఏడున నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ ఫక్కీరప్ప ప్రకటించిన విషయం విదితమే. ఇప్పుడు ఆ దిశగానే చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

అనంతపురం అర్బన్: జిల్లాల పునర్విభజన తరువాత తొలిసారిగా చేపట్టే గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. వేడుకల నిర్వహణపై కలెక్టర్ మంగళవారం రెవెన్యూభవన్‌లో జేసీ కేతన్ గార్గ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కోవిడ్ ఆంక్షలు లేనందున వేడుకలకు ప్రజలు అధికంగా హాజరయ్యే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు.

చిరు వ్యాపారులకు ఆర్థిక తోడ్పాటు

- 'జగనన్న తోడు' రుణాల పంపిణీలో కలెక్టర్ నాగలక్ష్మి
- ఆరో విడత వడ్డీలేని రుణాలు రూ.16.169 కోట్లు
- వడ్డీ రాయితీ కింద రూ.66.13 లక్షల మంజూరు



'జగనన్న తోడు' రుణాలు, వడ్డీ రాయితీకి సంబంధించి రూ.16,83,04,148 మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం అర్బన్: చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు' వడ్డీలేని రుణాలు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నాయని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి 'జగనన్న తోడు' రుణం, వడ్డీ రాయితీ మొత్తాన్ని బటన్‌నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లాలో ఆరో విడత 'జగనన్న పథకం' కింద నిరుపేదలైన చిరు వ్యాపారులు, హస్తకళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి మంజూరైన బ్యాంకు రుణం, వడ్డీ రాయితీ మొత్తం రూ.16,83,04,148 మెగా చెక్కును వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న తోడు కింద 16,169 మంది చిరు వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.16,16,91,000, వడ్డీ రాయితీ కింద 25,366 మందికి రూ.66,13,148 మంజూరైందన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. పేదలకు ఆర్థిక సహకారం అందిస్తూ వారి జీవన ప్రమాణాలు పెంచే దిశగా పలు సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. మేయర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రికి అందరూ తోడుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



చిరువ్యాపారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వడ్డీలేని రుణం ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు. కరోనా సమయంలోనూ మాస్కుల తయారీ పనిని మెప్మా, డీఆర్‌డీఏ మాకే అప్పగించింది. మాలాంటి చిరువ్యాపారులకు తోడుగా నిలుస్తున్న సీఎంజగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– శారద, గణేష్‌నగర్, అనంతపురం

వడ్డీలేని రుణంతో ఉపశమనం



మాలాంటి చిరువ్యాపారులు చాలామంది రూ.5, రూ.10 రోజువారీ వడ్డీకి అప్పు తెచ్చుకుని వ్యాపారం చేసుకునేవాళ్లం. బ్యాంకు ద్వారా రుణం ఇప్పించి వడ్డీని చెల్లిస్తూ తోడ్పాటు అందిస్తూ ఉపశమనం కల్పిస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– నూరున్నీసా, విద్యారణ్యనగర్, అనంతపురం

లక్ష్య సాధనలో వెనుకబడితే బ్లాక్ లిస్టులోకే

- డ్రిప్ కంపెనీల ప్రతినిధులకు ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ హరినాథరెడ్డి హెచ్చరిక



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ ఆఫీసర్ డా.హరినాథరెడ్డి

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా డ్రిప్, స్ప్రింక్లర్లను అందించాలని డ్రిప్ కంపెనీల ప్రతినిధులను ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి ఆదేశించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన కంపెనీలను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవన్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఏపీఎంఐపీ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీడీలు ఫిరోజ్‌ఖాన్, సుదర్శన్, ఉద్యాన అధికారులు రఘునాథరెడ్డి, నరసింహరావు సహా రెండు జిల్లాల డ్రిప్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. పండ్లతోటలకు సంబంధించిన ప్రగతిని జిల్లాలు, డివిజన్ల వారీగా ముఖ్య అతిథి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ హరినాథరెడ్డి సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలు సరఫరా చేశామని తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో 16 వేల హెక్టార్లకు గాను 8,500 హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 10,500 హెక్టార్లకు గాను కేవలం 4002 హెక్టార్లకు మాత్రమే డ్రిప్ పరికరాలు సరఫరా చేశారన్నారు. మొత్తం 26 డ్రిప్ కంపెనీలను కలెక్టర్ గుర్తించగా, అందులో డ్రిప్ పరికరాల లక్ష్య సాధనలో పూర్తి వెనుకబడిన అనంత బయోటెక్, అస్త, భూమి, సుజయ్, సాయిరాం, పారాగన్, కుమార్, సర్‌మెగా, సుధాకర్ తదితర కంపెనీల ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బంది రాకూడదన్న ఉద్దేశంతో గతంలో సరఫరా చేసిన డ్రిప్, స్ప్రింక్లర్ల బకాయిలు రూ.900 కోట్లు దశల వారీగా విడుదల చేసిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ ఏడాది కూడా డ్రిప్ పరికరాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వ వాటాగా రూ.250 కోట్లు విడుదల చేసిందని ప్రకటించారు. రైతుల అవసరాలకు తగ్గట్టు డ్రిప్, స్ప్రింక్లర్లు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బిల్లులు ఫిబ్రవరి నెలాఖరుకల్లా పంపాలని ఆదేశించారు. ఉద్యాన శాఖాధికారులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల అధికారులను అప్రమత్తం చేసి, సకాలంలో డ్రిప్ పరికరాలు అందించేలా చొరవ చూపాలని సూచించారు.

నకిలీ ఎన్‌ఓసీ కేసు ఏసీబీకి బదలాయింపు

కూడేరు: కమ్మూరు పొలం సర్వేనంబర్ 513కి సంబంధించి నకిలీ ఎన్‌ఓసీ వ్యవహారంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు కేసును ఏసీబీకి బదలాయించారు. కేసులో ప్రభుత్వ ఉద్యోగులైన కూడేరు తహసీల్దార్ శ్రీనివాసులు, ఉరవకొండ డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్, టూటౌన్ ఎస్‌ఐ రాంప్రసాద్, అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ త్రినాథ్ ఉన్నారు. లోతుగా విచారణ చేసేందుకు ఏసీబీ అధికారులు కేసుకు సంబంధించిన రికార్డులన్నింటినీ రెవెన్యూ అధికారుల నుంచి తీసుకున్నారు. నిందితులను ఏసీబీ అధికారులు మరోసారి విచారణ చేసే అవకాశముంది.

అంబరం.. సాహస క్రీడా సంబరం

- ఘనంగా సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళనం



సాహస విన్యాసాల్లో భాగంగా అగ్నికీలల మధ్యలోంచి బైక్‌పై దూసుకొస్తున్న విద్యార్థి

ప్రశాంతి నిలయం: సంస్కృతిని చాటే ప్రదర్శనలు, సాహసానికి ప్రతీకగా నిలిచే విన్యాసాలు, దేశ ఔన్నత్యాన్ని చాటే నృత్య రూపకాలు..కలగలిపి సత్యసాయి విద్యాసంస్థల వార్షిక క్రీడా సాంస్కృతిక సమ్మేళనం సంబరంగా సాగింది. బుధవారం పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ మైదానంలో సత్యసాయి విద్యాసంస్థల 40వ క్రీడా, సాంస్కృతిక సమ్మేళనం ఘనంగా జరిగింది. ఉదయం 8 గంటలకు ప్రశాంతి నిలయం నుంచి సత్యసాయి చిత్రపటాన్ని అలంకరించిన వాహనంలో బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా హిల్‌వ్యూ మైదానం వేదిక వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక ఆసనంపై కొలువుదీర్చి ఉత్సవాలను ప్రారంభించారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమని చాటుతూ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం సత్యసాయి డీమ్డ్ యునివర్శిటీ రిజిస్ట్రార్ సాయిగిరిధర్ యూనివర్సిటీ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడా జ్యోతిని వెలిగించారు.

ఆకట్టుకున్న విన్యాసాలు..

అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థులు బైక్ రైడింగ్‌తో ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు ప్రదర్శించారు. అగ్నికీలల మధ్య బైక్‌పై దూసుకుపోతూ నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ అబ్బురపరిచారు. బృందావన్, ప్రశాంతి నిలయం, ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థులు జిమ్నాస్టిక్, హైజంప్, లాంగ్‌జంప్, మార్షల్‌ఆర్ట్స్‌లో భాగంగా కత్తిసాము, కరాటే, కుంగ్‌ఫూ తదితర సాహస విద్యలను ప్రదర్శించారు. భారతీయ ఇతిహాసా ల్లోని పలు ఘట్టాలను వివరించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



సాహస విన్యాసాలు ప్రదర్శించిన విద్యార్థులతో సత్యసాయి సెంట్రల్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్

సాయంత్రం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి, భరతనాట్యం వంటి భారతీయ సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో కలెక్టర్ బసంత్ కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ రాజు, సభ్యులు పాల్గొన్నారు.

'నవోదయ'లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: నవోదయ విద్యాలయ సమితిలో ఆరో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు ఆర్‌జేడీ ఎం.వెంకటకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ (www. navodaya. gov. in) లో దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలి. రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు హెచ్‌ఎం/ప్రిన్సిపాల్ జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3.4వ తరగతి చదివి ఉత్తీర్ణత సాధించిన, జూలై 01, 2011 నుంచి ఏప్రిల్ 30, 2013 మధ్య జన్మించిన వారు అర్హులు.

'అనంత' స్ఫూర్తి మంత్రం

- స్వామి వివేకానందుడి ప్రేరణతో సేవా పరంపర
- జాతీయ యువజనోత్సవాల్లో జిల్లా యువత

సందర్భం | నేడు జాతీయ యువజనోత్సవం



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పరిణితి సాయి ప్రదర్శించిన నృత్యరూపకం (ఫైల్)

అనంతపురం కల్చరల్: 'భారతీయ ధర్మం అన్ని మతాలను అంగీకరిస్తుంది. అన్ని మతాలు సత్యాలే. నా మతం గొప్పదని ఇతరులను నిందిస్తే వారు హిందువులే కాదు. యువత మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలి' అన్న మాటలతో.. నేటి పరిస్థితులకు అద్దం పట్టే మహోన్నత సందేశాన్ని ఏనాడో స్వామి వివేకానంద జాతికందించారు. యువత పెడతోవ పట్టకూడదని, మతం... కులం పేరిట నిర్వీర్యం కాకుండా దేశ భవితను తీర్చిదిద్దే ప్రక్రియలో నిత్యం శ్రమించాలని ఆకాంక్షించిన వివేకానందుడి జయంతిని ఏటా జనవరి 12న 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. ఈ క్రమంలో ఈ ఏడాది మరింత భిన్నంగా.. స్ఫూర్తిదాయకంగా స్వామీ వివేకానంద జయంతిని నిర్వహించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా కర్ణాటకలోని ధార్వాడలో గురువారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకూ 'యువగళ్' పేరిట జాతీయ స్థాయి యువజనోత్సవాలకు శ్రీకారం చుట్టింది. ఈ ఉత్సవాల్లో జిల్లా కీర్తిని జాతీయ స్థాయిలో చాటిచెప్పేందుకు నెహ్రూయువకేంద్రం, యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యార్థులు తరలి వెళ్లారు. వీరిలో అనంతపురం ఆర్ట్స్ కళాశాలకు చెందిన 25 మంది, ఎస్కేయూ నుంచి నలుగురు, వైద్య కళాశాలకు చెందిన మరో నలుగురు, ఎన్‌వైకే తరఫున 18 మంది ఉన్నారు.

నేడు వివేకానంద జయంతి కార్యక్రమాలు

స్వామి వివేకాంద జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం అనంతపురంలోని శిరిడి నగర్‌లోని వివేకానంద భవన్, అశోక్‌నగర్‌లోని వివేకానంద పార్క్‌లో వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే అవోపా ఆధ్వర్యంలో చిన్నారులకు వివేకానంద వేషధారణ పోటీలు ఏర్పాటు చేశారు. నగరంలోని గీతామందిరంలో భారత వికాస పరిషత్తు ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతుల వితరణ జరుగనుంది. శ్రీసత్యసాయి జిల్లాలోనూ స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సేవా తత్పరతే మార్గం



సామాన్య రైతు కుటుంబానికి చెందిన నీలకంఠప్ప, అనసూయమ్మ దంపతుల కుమారుడు జయమారుతిది బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లి గ్రామం. సరిగా బస్సు సౌకర్యం కూడా లేని మారుమూల గ్రామం. ఎంతో కష్టపడి పీజీ పూర్తి చేసి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. పర్యావరణ పరిరక్షణ, కరోనా, ఎయిడ్స్ వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించాడు. సాయుధ దళాలనిధి సేకరణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని రాష్ట్రస్థాయి ఉత్తమ వలంటీర్‌గా పురస్కారాన్నందుకున్నాడు. ఈ క్రమంలోనే ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా 2020లో గుజరాత్‌లో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొన్న అతను మరోసారి ఎన్‌వైకే తరఫున ఈ ఏడాది జాతీయ యువజనోత్సవాలకు ఎంపికయ్యాడు. సేవా మార్గమే తన లక్ష్యమని అనంత తరఫున మరోసారి ప్రెసిడెంట్ మెడల్ సాధిస్తానన్న ఆత్మ విశ్వాసాన్ని ఈ సందర్భంగా జయమారుతి కనబరిచారు.

శాస్త్రీయ నృత్యంలో ఘనాపాటి



సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే అనంత శాస్త్రీయ నృత్యాన్ని జాతీయ స్థాయిలో ఘనంగా చాటాలని తపన పడే పరిణితి సాయి... చిరు ప్రాయంలోనే న్యూఢిల్లీలో జరిగిన శాస్త్రీయ నృత్య పోటీల్లో రాణించింది. నగరానికి చెందిన ఏజీ చంద్రశేఖర్, శ్రీవాణి దంపతుల కుమార్తె అయిన పరిణితి సాయి... అనంతపురంలోని వైద్య కళాశాలలో ప్రథమ సంవత్సరం వైద్య విద్యను అభ్యసిస్తోంది. ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి వద్ద భరతనాట్యం, కూచిపూడిలో శిక్షణ పొందింది. ఇటీవల నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో అనంత వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పరిణితి సాయి బృందం ప్రదర్శించిన 'మహిషాసుర మర్దిని' నృత్యరూపకం జాతీయ యువజనోత్సవాలకు ఎంపికై ంది. ఈ క్రమంలో పరిణితి సాయి బృందం మరోసారి జాతీయ వేదికపై నృత్య రూపకాన్ని ప్రదర్శించేందుకు ధార్వాడకు తరలివెళ్లింది.

పేదరికం అడ్డు కాలేదు



వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన నిరుపేద రైతు లీలాధర్, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె నందిత... అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపకుండా ట్యూషన్లు చెప్పుకుంటూ తన చదువును కొనసాగిస్తోంది. ఇటీవల రాష్ట్రస్థాయిలో 'జానపద నృత్యం'లో మెప్పించిన ఆమె... జాతీయ స్థాయి యువజనోత్సవాలకు ఎంపికైంది. జాతీయ స్థాయిలోనూ తాను రాణిస్తాననే ఆత్మవిశ్వాసాన్ని ఆమె కనబరిచింది.

మోదీ సభను నిర్వహిస్తున్నదీ జిల్లా వాసే



జిల్లాకు చెందిన బిసాటి భరత్ అనంత నుంచి హస్తిన వరకూ తనదైన ప్రతిభాపాటవాలను కనపరుస్తూ అనేక ప్రతిష్టాత్మక పురస్కారాలందుకున్నారు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన భరత్ ఇప్పటికే రాష్ట్రపతి చేతుల మీదుగా బెస్ట్ ఎన్‌ఎస్‌ఎస్ అవార్డుతో పాటూ దేశంలోనే అతికొద్దిమందికి దక్కే అరుదైన యూఎన్‌ఓ అవార్డును సైతం సొంతం చేసుకున్నారు. ఇటీవల కర్ణాటకలోని హుబ్లీ నెహ్రూ యువకేంద్ర ఆఫీసర్‌గా వెళ్లిన మూడు నెలలకే జాతీయ స్థాయి యువజనోత్సవాలను నిర్వహించే బాధ్యతను కేంద్రం అతనికి అప్పగించింది. ఈ క్రమంలో సాక్షాత్తు ప్రధాని నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, న్యాయమూర్తులు పాల్గొనే యువజనోత్సవాలను ఈ సారి భరత్ స్ఫూర్తిదాయకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

ప్రణాళికకే ప్రధానం

- 2023-24 వార్షిక విద్యా ప్రణాళిక తయారీలో నిమగ్నం
- పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ కసరత్తు

అనంతపురం: ఏదైనా పని విజయవంతం చేసేందుకు సరైన ప్రణాళిక అవసరం. ఈ క్రమంలోనే రాబోవు విద్యా సంవత్సరానికి అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలను సమగ్ర శిక్ష విభాగం సిద్ధం చేస్తోంది. సమగ్ర శిక్ష పరిధిలోని కేజీబీవీలు, ఇతర సెక్టోరియల్ విభాగాలతో పాటు పాఠశాల స్థాయిలో అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. మండల స్థాయి, అనంతరం జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించి రాష్ట్రస్థాయికి పంపనున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రణాళిక సలహా సంస్థ ఆమోదంతో నిధులు ఖరారు కానున్నాయి. వీటి ఆధారంగానే పాఠశాలలకు నిధులు కేటాయిస్తారు. 2022-23 విద్యా సంవత్సరంలో సమగ్రశిక్ష పరిధిలోని సెక్టోరియల్ విభాగాలకు, కేజీబీవీల అభివృద్ధి, కేజీబీవీ సిబ్బంది జీతాలు, విద్యార్థినిలకు హాస్టల్ నిర్వహణ నిమిత్తం తదితర ఖర్చుల నిమిత్తం రూ.520 కోట్ల నిధులు విడుదల చేశారు. తాజాగా 2023-24 విద్యా సంవత్సరంలో గణనీయమైన నిధులు రాబట్టేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమగ్రశిక్ష డీపీసీ ఎం.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ప్రణాళిక రూపకల్పన ప్రక్రియ వేగవంతమైంది.

మైక్రో లెవల్ ప్లానింగ్‌తో ముందుకు

రాష్ట్ర స్థాయి నుంచి పాఠశాల అవసరాలు గుర్తించకుండా, పాఠశాల స్థాయి నుంచి గుర్తించాలనేది మైక్రో లెవల్ ప్లానింగ్ ముఖ్య ఉద్దేశ్యం. ఈ క్రమంలో యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (యూ-డైస్)ను ప్రాతిపదికగా తీసుకుని పాఠశాల స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతేడాది ఏడబ్ల్యూపీ అండ్ బీ (యాన్యువల్ వర్క్‌ప్లాన్ అండ్ బడ్జెట్)ను తయారు చేశారు. నూతన జాతీయ విద్యావిధానం -2020 నిబంధనల మేరకు ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు ఆరు విభాగాలుగా పాఠశాలలను వర్గీకరించారు. గతంలో సర్వశిక్ష, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ వేర్వేరుగా ప్రణాళికలు రూపకల్పన చేస్తుండగా, తాజాగా వీటిని ఒకే గొడుకు కిందకు తెస్తూ సమగ్ర శిక్షగా పేరు మార్చి ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులే కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ప్రణాళిక రూపకల్పనపై షెడ్యూల్

మండలంలోని అన్ని స్కూల్‌కాంప్లెక్స్ పాఠశాలలు అదనంగా కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రణాళికలు క్రోడీకరించి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఈ నెల 12వ తేదీలోపు పూర్తిచేయాల్సి ఉంటుంది. 16వ తేదీన మండల రీసోర్స్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి క్లస్టర్ డెవలప్‌మెంట్‌పై చర్చించాలి. ఈ నెల 18, 19 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్, హెచ్‌ఎంలు, మండలంలోని లైన్ డిపార్ట్‌మెంట్లతో చర్చించి మండల ప్రణాళిక పూర్తి చేయాలి.

గుంతకల్లు మార్కెట్ యార్డు చైర్మన్‌గా మోహన్



గుంతకల్లు: గుంతకల్లు మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎస్‌వీఆర్ మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌తో పాటు మరో 18 మంది సభ్యులను ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, చైర్మన్‌గా మోహన్, వైస్ చైర్మన్‌గా పాండురంగారెడ్డి, సభ్యులుగా మనోహర్‌రెడ్డి, సుబ్బన్న, బషీర్‌బీ, సరస్వతి, సయ్యద్ బాషా, గంగమ్మ, పద్మావతి, ఓబులేసు, కాంతమ్మ, దీప్లాబాయి, సుధారమణ, రామాంజినేయులు, వీరాప్రతాప్‌తో పాటు గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మండల కో-ఆపరేటివ్ అధ్యక్షుడు, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. కాగా, నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఈ నెల 13న ఉదయం పది గంటలకు స్థానిక మార్కెట్ యార్డులో ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



సంతోష్ (ఫైల్)

కణేకల్లు: ముందు వెళుతున్న ఆటోను వెనుక నుంచి ద్విచక్ర వాహనంతో ఢీకొన్న ఘటనలో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా, మరో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కణేకల్లు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన నాగిరెడ్డి కుమారుడు శేఖర్... స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న శేఖర్.. తన చిన్నాన్న వన్నారెడ్డి కుమారుడు సంతోష్ (5)తో ఆడుకుంటూ సరదాగా బైక్‌పై ఎక్కించుకుని చక్కర్లు కొట్టడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో జెడ్పీఉన్నత పాఠశాల వద్ద రోడ్డుపై ఎదురుగా వెళుతున్న లగేజ్ ఆటోను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో ఇరువురూ కిందపడ్డారు. సంతోష్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శేఖర్‌ను కుటుంబసభ్యులు బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై కణేకల్లు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఫలించిన సెంటిమెంట్ మంత్రం

- దున్నపోతు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం
- పోలీసుస్టేషన్ వేదికగా పంచాయితీ

కణేకల్లు: తీవ్ర ఉత్కంఠకు తెరలేపిన అమ్మవారి దున్నపోతు సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. అందుబాటులో ఉన్న ఒకేఒక దున్నపోతుతో అంబాపురం, రచ్చుమర్రి గ్రామస్తులు ఊరి దేవర జరుపుకునేందుకు సిద్ధమైన నేపథ్యం తెలిసిందే. ఈ క్రమంలో దున్నపోతు తమదంటే తమదంటూ ఇరు గ్రామాల ప్రజలు వాగ్వాదానికి దిగి 20 రోజులుగా ఉత్కంఠకు తెరలేపారు.

అసలేం జరిగిందంటే...

ఈ నెల 17న అంబాపురంలో దేవర నిర్వహించాలని గ్రామస్తులు నిశ్చయించిన నేపథ్యంలో అమ్మవారి పేరుతో వదిలిన దున్నపోతు కోసం దాదాపు 30 రోజులకు పైగా వివిధ ప్రాంతాల్లో గాలించి చివరకు బొమ్మనహాళ్ మండలంలో కనిపించిన దేవరపోతును తీసుకెళ్లి బంధించారు. ఈ విషయం తెలుసుకున్న రచ్చుమర్రి గ్రామస్తులు అంబాపురానికి వెళ్లి తమ గ్రామ దేవత పేరున వదిలిన దున్నపోతును ఎలా బంధిస్తారంటూ వాదనకు దిగారు. అప్పటి నుంచి ఈ రెండు గ్రామాల మధ్య దున్నపోతు పంచాయితీ నలుగుతూ వస్తోంది.

ఎటూ తేల్చని పంచాయితీ..

ఇరు గ్రామాల ప్రజలను బుధవారం కణేకల్లు పోలీస్ స్టేషన్‌కు సీఐ యుగంధర్ పిలిపించుకుని మాట్లాడారు. ఒక్కో గ్రామం నుంచి 80 నుంచి 90 మంది ప్రజలు తరలిరావడంతో పోలీస్ స్టేషన్ కిటకిటలాడింది. దున్నపోతును వదులుకునేది లేదంటూ అంబాపురం వాసులు వివరించారు. అయితే తమ గ్రామ దేవతకు సంబంధించిన దున్నపోతును తామూ వదులుకోబోమని రచ్చుమర్రి వాసులు తేల్చి చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పంచాయితీ... మధ్యాహ్నం 1 గంట వరకూ సాగింది. సమస్యకు పరిష్కారం దక్కకపోవడంతో ఇరువైపులా ఐదుగురు చొప్పున గ్రామ పెద్దలను స్టేషన్ లోపలకు పిలుచుకెళ్లి సీఐ చర్చించారు. అయినా ఏకాభిప్రాయం కుదరలేదు. అనంతరం ఎవరికి వారు ఆ దున్నపోతు తమదంటే తమదంటూ దేవుడిపై ప్రమాణాలు చేశారు. చివరకు టాస్ వేసి తుది నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. అయితే టాస్ వేస్తే తమకు అన్యాయం జరుగుతుందనే ఆందోళన ఇరు గ్రామాల ప్రజల్లో తలెత్తి చివరకు ఈ అంశాన్ని కూడా విరమించుకున్నారు.

సెంటిమెంట్‌తో రాజీ కుదిర్చిన సీఐ..

చివరగా సీఐ యుగంధర్ ఇరు గ్రామాల పెద్దలను కూర్చొబెట్టి చర్చలు జరిపారు. ఈ నెల 17న అంబాపురంలో దేవర ఉందని, రచ్చుమర్రిలో దేవరకు ఇంకా ఏడాది గడువు ఉండడంతో దున్నపోతు కొనుగోలుకు అంబాపురం వాసులతో డబ్బిప్పిస్తానన్నారు. ఇది దైవ కార్యం కావడంతో అందరికీ మంచి జరుగుతుందని, మరో ఏడు రోజుల్లో ఊరి దేవర ఉండడంతో మంచి మనసుతో ఆలోచించి అంబాపురం వాసులకు సహకరించాలని, దీంతో అమ్మవారు కూడా శాంతిస్తారని సీఐ నచ్చచెప్పారు. సీఐ ప్రయోగించిన సెంటిమెంట్ అస్త్రం రచ్చుమర్రి వాసులను ఆలోచనలో పడేసింది. చివరకు అంబాపురంలో దేవర ముగిసిన తర్వాత ఓ దున్నపోతును కొనిస్తామంటూ ఆ గ్రామస్తులు భరోసానివ్వడంతో ఇరు గ్రామాల మధ్య రాజీ కుదిరింది. ఎట్టకేలకు దున్నపోతు సమస్యకు పరిష్కారం దక్కడంతో అంబాపురం వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్యాక్షన్ రాజకీయాలు పరిటాల కుటుంబానికే చెల్లు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: ఫ్యాక్షన్ రాజకీయాలు పరిటాల కుటుంబానికే చెల్లుబాటవుతాయని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం చెన్నేకొత్తపల్లికి వచ్చిన ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫ్యాక్షన్, వర్గకక్షలు, హత్యా రాజకీయాలకు వైఎస్సార్‌సీపీ విరుద్ధమన్నారు. రాష్ట్రంలో జగన్ సర్కార్ ఏర్పాటైన ఈ మూడున్నరేళ్ల కాలంలో తామెన్నడూ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించలేదని గుర్తు చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ చేపట్టిన పాదయాత్రకు జనం రాకపోడంతో నిరాశ నిస్పృహలతో పరిటాల సునీత లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో గొడవలు సృష్టిస్తున్నది టీడీపీకి చెందిన వారేనన్నారు. ఏ చిన్న పాటి సమస్య తలెత్తినా విషయాన్ని పెద్దదిగా చూపించేందుకు పచ్చపత్రికలు ప్రయత్నిస్తున్నాయన్నారు. అంతేకాక సీమాంధ్ర, రాయలసీమ వాసులకు వరి అన్నం రుచి చూపించింది ఎన్టీఆర్ అంటూ పచ్చపత్రికల్లో కథనం ప్రచురించడాన్ని తప్పుబట్టారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

వంద శాతం లక్ష్య సాధనే ధ్యేయం

- ఫీజు వసూళ్లపై సిబ్బందిని ఆదేశించిన మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని 17 మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన ఫీజు వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలని మార్కెటింగ్ సిబ్బందిని ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రామాంజినేయులు ఆదేశించారు. మార్కెట్ ఫీజు వసూళ్లకు సంబంధించి బుధవారం అనంతపురంలోని మార్కెట్ యార్డులో ఉన్న ఆ శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్‌ఎన్ మూర్తితో కలసి యార్డు సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్షించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో రెండు నెలలే గడువు ఉందని, ఈ నేపథ్యంలో నిర్దేశిత ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యానికి తావివ్వరాదన్నారు. అనంతపురం జిల్లాలోని 9 కమిటీల ద్వారా రూ.10.44 కోట్లకు గానూ 70 శాతంతో రూ.7.30 కోట్లు వసూలైనట్లు తెలిపారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో 8 కమిటీల ద్వారా రూ.5.24 కోట్లకు గానూ 52 శాతంతో రూ.2.70 కోట్లు మాత్రమే వసూలైందన్నారు. అనంతపురం, శింగనమల, రాప్తాడు, కదిరి, పుట్టపర్తిలాంటి ఏడెనిమిది కమిటీల పరిస్థితి ఆశాజనకంగా ఉన్నా... గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, తనకల్లు, పెనుకొండ తదితర కమిటీల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉన్న ఈ రెండు నెలల గడువును సద్వినియోగం చేసుకుని వంద శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. యార్డులు, చెక్‌పోస్టుల్లో విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాప్తాడు: మండల కేంద్రంలో గురువారం ఉదయం 8 గంటలకు, అలాగే రాప్తాడు పంచాయతీలోని గంగలకుంట గ్రామంలో మధ్యాహ్నం 3 గంటలకు 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఆలమూరు లే అవుట్ సందర్శన

అనంతపురం క్రైం: ఆలమూరు లే అవుట్‌ను కమిషనర్ కే భాగ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనులు ఏయే దశలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని లబ్ధిదారులకు కమిషనర్ తెలిపారు.

వార్షిక బడ్జెట్‌పై కసరత్తు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ 2023-24 వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. బడ్జెట్‌లో లెక్కలు పక్కాగా ఉండేలా చూసుకోవాలని కమిషనర్ కే భాగ్యలక్ష్మి బుధవారం నగరపాలక సంస్థలో అకౌంట్స్ విభాగం అధికారులను ఆదేశించారు. గతేడాది రూ.57.35 కోట్ల వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేసినప్పుడు పలు అంశాలపై కార్పొరేటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మరోసారి అటువంటి పరిస్థితి లేకుండా బడ్జెట్‌లో వివిధ అంశాల లెక్కల్లో ఎటువంటి లోపాలు కన్పించకుండా ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసుకుని బడ్జెట్‌ను సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

లంచం అడిగితే ఫోన్ చేయండి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అవినీతికి పాల్పడినా, లంచం అడిగినా టోల్ ఫ్రీ నంబరు 1902కు గాని, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం 08554-246427 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ బాబాఫకృద్దీన్ తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

పరామర్శ



పూలకుంట శివారెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు సింగిల్ విండో అధ్యక్షుడు పూలకుంట శివారెడ్డిని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. బెంగళూరులో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న పూలకుంట శివారెడ్డి కుమారుడు చరణ్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం విశ్వేశ్వరరెడ్డి పూలకుంటకు వెళ్లి శివారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంతో భవిష్యత్తు ఉన్న కుమారుడు అకాల మరణం బాధాకరమన్నారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న ఉన్నారు.

ప్రైవేటీకరణ దుర్మార్గపు చర్య

అనంతపురం అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 23 నుంచి 25 వరకు చేపట్టనున్న ఆందోళనల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు

అనంతపురం కల్చరల్: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ ప్రాంగణంలో కొలువుదీరిన త్యాగరాజ స్వామి ఆలయంలో 176వ ఆరాధనా ఉత్సవాలు వేడుకగా సాగాయి. శ్రీవిజయవాణి సంగీత కళా నిలయం నిర్వాహకుడు మొదలి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తూ పంచరత్న గాన సేవ జరిగింది.

• సొంతూరుకు చలోచలో

విద్యా సంస్థలకు సంక్రాంతి సెలవులు ఇచ్చారు. వసతిగృహాలు, బంధువుల ఇళ్లు, రూముల్లో ఉంటూ అనంతపురంలో చదువుకుంటున్న విద్యార్థులు బుధవారం సొంతూళ్లకు పయనమయ్యారు. లగేజీలతో చేరుకున్న విద్యార్థులతో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడింది. బస్సుల్లో సీట్ల కోసం పెద్ద ఫీట్లే చేశారు. స్నేహితులు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పుకొని, కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు, సరదాగా పండుగ చేసుకునేందుకు సంతోషంగా బస్సుల్లో బయల్దేరారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కిటకిట: ఊళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వచ్చిన జనం..



ఆ సీట్ నాదే: బస్సులో సీటు కోసం అవస్థలు..



వెళ్లొస్తాం: లగేజీతో బయులుదేరిన యువకులు

26 నుంచి లఘు చిత్రాల ప్రదర్శన



పోస్టర్లను విడుదల చేస్తున్న మేయర్ వసీం సలీం

అనంతపురం క్రైం: ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులకు కళాకారులు, దర్శక, నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సాహించేందుకు ఈనెల 26 నుంచి 28 వరకూ లఘు చిత్రాల ప్రదర్శన ఉంటుందని మేయర్ మహమ్మద్ వసీం సలీం అన్నారు. బుధవారం ముస్లిం ఐక్యవేదిక, అనంత ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో లఘు చిత్రాల అవార్డులకు సంబంధించిన పోస్టర్లను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 21వ తేదీలోపు తమ ఎంట్రీలను యూట్యూబ్ లింక్ ద్వారా 9676350681, 7288022467 నంబర్లకు పంపాలన్నారు. ఎన్నికైన చిత్రాలకు 18 కేటగిరీల్లో పుర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 26 నుంచి 28 వరకూ చిత్రాల ప్రదర్శన, 29వ తేదీన అవార్డులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రజాక్, జాకీర్ హుస్సేన్, షేక్ నిజాం, మహేష్, మసూద్ పాల్గొన్నారు.

రేషన్ షాపు ప్రారంభం..

అనంతపురం క్రైం: 39వ డివిజన్‌లోని వడ్డే కాలనీలో ఏర్పాటు చేసిన రేషన్ షాపును వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డితో కలసి మేయర్ మహమ్మద్ వసీం సలీం బుధవారం ప్రారంభించారు. ప్రజలకు రేషన్ సరుకులు అందజేసి, మాట్లాడారు. రేషన్ సకాలంలో అందించేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు రేషన్ సరుకులు ఇంటి ముంగిటకే అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చింతకుంట మధు, రఫి, డిష్ శీనా, గుర్రప్ప, బంగారప్ప, డీలర్ల సంఘం అధ్యక్షులు చెన్నారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, స్టోర్ డీలర్ హిదయ్‌తుల్లా పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి

అనంతపురం రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకూ ముగ్గుల పోటీలు, రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దక్ష కన్‌స్ట్రక్షన్ ఎండీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. 13న ముగ్గుల పోటీలు, 14న న్యూకేటగిరీ, 15న ఒంగోలు జాతి సీనియర్ ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి కింద 12 గ్రాములు, రెండవ బహుమతిగా 8 గ్రాముల బంగారం ఇవ్వడం జరుగుతుందన్నారు. న్యూ కేటగిరీ బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వృషభాల యాజమానులకు మొదటి బహుమతిగా యూనికాన్ బైక్, రెండో స్థానంలో నిలిచిన వృషబాల యాజమానులకు రూ. లక్ష, మూడో స్థానానికి రూ.80 వేలు, నాలుగో స్థానానికి రూ. 60 వేలు, ఐదో స్థానంలో నిలిచిన వృషబాల యాజమానులకు రూ. 60 వేలు అందిస్తామన్నారు. జూనియర్ ఒంగోలు జాతి వృషబాల బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వృషబాల యాజమానులకు ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్, రెండో బహుమతిగా రూ.2 లక్షలు, మూడో బహుమతిగా రూ.1.50 లక్షలు, నాల్గో బహుమతిగా రూ. 1.25 లక్షలు, ఐదో బహుమతిగా రూ. లక్ష అందజేస్తామన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరవుతారన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడానికి ఈనెల 15న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి హాజరవుతారన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

రాప్తాడు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 6వ విడత జగనన్న తోడు పథకం ద్వారా చిరు వ్యాపారులకు మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో చిరు వ్యాపారుల పడుతున్న కష్టాలను కళ్లారా చూశారన్నారు. చిరు వ్యాపారులను ఆదుకునేందుకు సున్నా వడ్డీకే రుణాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఏపీఎం శివకుమార్, వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలందరూ రుణపడి ఉంటారని డ్వాక్రా సంఘం మహిళలు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 6వ విడత జగనన్న తోడు పథకం ద్వారా చిరు వ్యాపారులకు మెగా చెక్కును పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్ చంద్రకళ, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్ నాయక్, నీలిమ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ వాసుదేవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బాలపోతన్న, నాయకులు వెంకట్రాముడు, అతికిరెడ్డి, పోతన్న, లక్ష్మీనారాయణ రెడ్డి, ఏపీఎం మదన్ మోహన్ పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: జగనన్న తోడు' పథకం చిరు వ్యాపారులకు కొండంత అండగా ఉంటుందని అనంతపురం ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, ఎంపీడీఓ బాబాఫకృద్దీన్ అన్నారు. బుధవారం అనంతపురం ఎంపీడీఓ కార్యాలయంలో 6వ విడత జగనన్న తోడు పథకం కింద అనంతపురం రూరల్ మండలంలోని 1,073 లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తూ చిరు వ్యాపారులను ప్రోత్సహిస్తోందన్నారు.

విద్యార్థిని అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక గుత్తి రోడ్డు సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న వేణుగోపాల్‌నగర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని బుధవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ గౌస్ తెలిపారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

రాజీవ్‌కాలనీ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?



మాట్లాడుతున్న రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆశాబీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాజీవ్ కాలనీ పంచాయతీ అభివృద్ధిపై ఎలాంటి చర్చకైనా నా సిద్ధమేనని సర్పంచ్ దూదేకుల ఆశా బీ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పంచాయతీని అంతా తానే అభివృద్ధి చేశానని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చెప్పడం సిగ్గుచేటన్నారు. టీడీపీ టికెట్ దక్కదనే విషయాన్ని తెలుసుకుని ఇష్టారాజ్యంగా నీచ, దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే దృష్టిలో అభివృద్ధి అంటే పనులను అసంపూర్తిగా వదిలేయడం, పనులను అడ్డుకోవడమే అని ఎద్దేవా చేశారు. రాజీవ్ కాలనీ పంచాయతీ బ్రిడ్జిని సగంలో వదిలేసి పారిపోయారన్నారు. టీడీపీ హయాంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని మాజీ సర్పంచ్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పసులూరు ఓబులేసు ధ్వజమెత్తారు. రాజీవ్ కాలనీ పంచాయతీలో నిర్మిస్తున్న బ్రిడ్జికి రూ. 3 కోట్లు ఖర్చు అయితే దానికి రూ.1.70 కోట్లు మంజూరు చేయించడం ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనం అని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 2019 నుంచి 2022 వరకూ రాజీవ్ కాలనీ పంచాయతీలో రూ.14.88 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ రహీం, మాజీ సర్పంచ్ హుస్సేన్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనరసమ్మ, దౌలా, నీలమ్మ, ఓబులేసు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు పరిష్కారం

అనంతపురం క్రైం: స్పందన ఫిర్యాదులకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించేలా అధికారులకు సూచించినట్లు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈఓ వెంకటకృష్ణారెడ్డి

రాప్తాడు: ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు ఇన్‌చార్జ్ డీఈఓ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఉదయం రాప్తాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సమ్మేటివ్ పరీక్షల్లో ఎవరెవరికి ఎన్ని మార్కులు వచ్చాయని ఆరా తీశారు. అత్యధిక మార్కులు సాధించిన గీతామాధురి, శ్రీకాంతరెడ్డి, భార్గవిని అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. ట్యాబ్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. ఇప్పటి వరకూ నిర్వహించిన పరీక్షల్లో మార్కుల సాధనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, హెచ్‌ఎం నరసింహులు, ఏఎంఓ హరికృష్ణ పాల్గొన్నారు.

దొంగల కోసం రంగంలోకి ప్రత్యేక బృందం

• కార్ డెక్కార్ దుకాణాల్లో చోరీ కేసు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కార్ డెకార్ దుకాణాల్లో చోరీలకు తెగబడిన దొంగల జాడను తెలుసుకునేందుకు త్రీటౌన్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. ఇప్పటికే ఈ కేసులో కొంత మేర పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. వరుస చోరీలతో నగర పోలీసులకు సవాలుగా మారిన దొంగల ముఠా ఈ ప్రాంతానికి చెందినది కాదని గుర్తించారు. విశాఖ పట్టణానికి చెందిన ఓ టూవీలర్ నంబరు ప్లేటుతో ఎక్కడో అపహరించిన రిడ్జ్ కారులో 2022 డిసెంబరు 28న కర్నూలు జిల్లాలో రెండు కార్ డెక్కార్ దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. అక్కడి నుంచి డిసెంబరు 31వ తేదీ రాత్రి అనంతపురం చేరుకున్న దొంగలు స్థానిక తపోవనంలోని మూడు కార్ డెక్కర్ దుకాణాల్లో చోరీ చేశారు. నాలుగు రోజుల పాటు గుట్టుచప్పుడు కాకుండా కాలం గడిపిన వారు 2023 జనవరి 7వ తేదీ తెల్లవారుజామున తిరిగి తపోవనం సమీపంలోని రమేష్ వీల్ అలైన్‌మెంట్ దుకాణంలో చొరబడ్డారు. కాగా దుకాణం షెట్టర్‌ను ఇనుప చువ్వలతో కొట్టి, లోపలికి చొరబడ్డారు. దుకాణంలో రూ.39 వేల నగదును అపహరించిన దొంగలు వారు ఎక్కడో అపహరించి తెచ్చిన కారును దుకాణానికి కొంత దూరంలో ఆపి ఆవరణంలో అమ్మకానికి పెట్టిన షిఫ్ట్ డిజైర్ కారుతో ఉడాయించారు. వదిలి వెళ్లిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా కారులో విలువైన వస్తువులను, సెన్సార్‌ను పని చేయకుండా చేశారు. దొంగలు వదిలి వెళ్లిన కారును పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు పొందేలా అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూఏ వీసీ రంగజనార్ధన

అనంతపురం: వివిధ ఫండింగ్ ఏజెన్సీల నుంచి ఇతోధికంగా రీసెర్చ్ ప్రాజెక్టులు పొందేలా అధ్యాపకులు అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన అన్నారు. బుధవారం జేఎన్‌టీయూ అనంతపురంలో డైరెక్టర్ ఆఫ్ స్పాన్సర్డ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో 'వర్క్‌షాప్ ఆన్ రైటింగ్ ఆర్‌అండ్‌డీ గ్రాంట్ ప్రపోజల్' అంశంపై అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. రీసెర్చ్ అంశాల్లో ఎదురయ్యే అవరోధాలను ఎలా అధిగమించాలో తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. రీసెర్చ్ ప్రపోజల్స్ ఫండింగ్ ఏజెన్సీలకు ఎలా పంపాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, న్యూఢిల్లీ శాస్త్రవేత్త డాక్టర్ రాజీవ్ కే.తాయల్ వివరించారు. ఇందులో భాగంగా రీసెర్చ్ ఫండింగ్ ఎంత మేరకు పొందాలి అనే అంశాలపై అధ్యాపకులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రీసెర్చ్ అడ్వైజర్ డాక్టర్ జీఆర్ ప్రసాద్ రాజు, జేఎన్‌టీయూ అనంతపురం డైరెక్టర్ ప్రొఫెసర్ పద్మ సువర్ణ, జేఎన్‌టీయూ అనంతపురం వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవానీ పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పథకంతో గ్రామీణాభివృద్ధి

రాప్తాడు: వాటర్‌షెడ్ పథకంతో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హంపాపురం, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. నూతన పశువుల తాగునీటి తొట్టి, తాగు నీటి ట్యాంకుల నిర్మాణానికి ఎంపీపీ జయలక్ష్మితో భూమి పూజ చేశారు. వాటర్‌షెడ్ పథకం కింద భూగర్భ జలాల పెంపునకు రూ.3 కోట్లు, సబ్సిడీ వ్యవసాయ పరికరాలకు రూ.97 లక్షలు, గ్రామైక్య సంఘంలో జీవనోపాధులకు రూ.97 లక్షలు, హంపాపురం ప్రాజెక్టుకు రూ.6 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వరలక్ష్మి, వాటర్ షెడ్ చైర్మన్ రామకృష్ణ, వైస్ చైరపర్సన్ రేణుక, వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు మాధవ రెడ్డి, లింగా రెడ్డి, మల్లన్న, చెన్నా రెడ్డి, నాగరాజు, రమణా రెడ్డి పాల్గొన్నారు.

దేవుడికి అనుకూలంగా నడుచుకోవాలి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని ఏసుకృపా మందిరంలో బుధవారం జిల్లా పాస్టర్స్ సంక్షేమ సంఘం 31వ సర్వసభ్య సమావేశం జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన పాస్టర్ కె. పరిశుద్ధ రావు ఆరాధన జరిగించి దేవుని వాక్యమును బోధించారు. మన నడత దేవునికి అనుకూలంగా ఉండాలన్నారు. అనంతరం క్రైస్తవ సాహిత్యాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రెవ పి.మార్క్, కార్యదర్శి రెవ జీఆర్ ఆనంద్, జాయింట్ కార్యదర్శి వి.మనష్షే, సభ్యులు పాస్టర్ శాంతవర్ధన్, పాస్టర్ ఎం.రూఫస్, కె.జీవన్ బాబు, పాస్టర్ సయ్యద్ వల్లి, గౌరవ సలహాదారులు బిషప్ వాసు అనిల్ కాంత్, పాల్గొన్నారు.

గుత్తి కోట క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం సప్తగిరి సర్కిల్: గుత్తి కోట క్యాలెండర్లను అనంతపురం ఎంపీ తలారి రంగయ్య బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అనంత జిల్లాలో అత్యంత పురాతన చరిత్ర ఉందన్నారు. ప్రపంచ స్థాయిలో గుత్తికి ప్రత్యేకత ఉందన్నారు. గుత్తి కోట పరిరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. గుత్తి కోట అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుంటాయన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రాజశేఖరరెడ్డి, నాయకులు మురళీకృష్ణ, మల్లికార్జున రెడ్డి, నవీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వెంటనే పూర్తవ్వాలి

రాప్తాడురూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ తదితర భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని రాప్తాడు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. భవనాలను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. పూలకుంటలో చేరుకుని సచివాలయం, ఆర్బీకే భవనాలను పరిశీలించారు. కార్యాలయంలో అనంతపురం ఎంపీడీఓ బాబా ఫకృద్దీన్, పంచాయతీరాజ్ జేఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

ఆత్మకూరు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ ఆయిషా అన్నారు. బుధవారం మండలంలోని తలుపూరు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బిల్లులు కూడా త్వరగా కూలీల ఖాతాలకు జమ అవుతాయన్నారు. కూలీలు పనులకు వచ్చేలా చూడాలని సూచించారు



మాంటిస్సోరి పాఠశాలలో..



శ్రీ చైతన్య విద్యా సంస్థలో..

ముందస్తు సంక్రాంతి సందడి

అనంతపురం: నగరంలోని పలు పాఠశాలల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. మాంటిస్సోరి విద్యా సంస్థలు గుత్తి, సంగమేశ్వర సర్కిల్‌లో బ్రాంచ్‌ల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాండెంట్ సి.సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మాంటిస్సోరి పాఠశాల కార్యదర్శి కే.మాధవి, ప్రిన్సిపాల్స్ కే.పద్మావతి, ఏ.రమాదేవి పాల్గొన్నారు. శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఏజీఎం సుబ్బా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సమీనాఖాన్, తబుస్సు, నేత్రావతి, స్వరూపరాణి పాల్గొన్నారు. ప్రసాద్ స్కూల్స్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో కరస్పాండెంట్స్ నాగరాజు, ప్రసాద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు: ఆత్మకూరు ఎస్‌ఐగా రంగడు యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో జిల్లా కేంద్రంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ ఆత్మకూరుకు బదిలీపై వచ్చారు. ఆత్మకూరులో పని చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు బదిలీపై శింగనమలకు వెళ్లారు.

మంచి గ్రేడ్ సాధించాలి

రామగిరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్స్‌ను ఎంఈఓ సాయికృష్ణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రమీల, యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, సురేష్, వెంకటకృష్ణ, శంకర్‌రెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి, సంజీవ్, రంగా నాయక్, కొట్టప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సిండికేట్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్-3 అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం కూడేరు ప్రాజెక్ట్ సీడీపీఓ ధనలక్ష్మి తనిఖీ చేశారు. ఇక్కడ కార్యకర్తగా పని చేస్తున్న త్రివేణి ఈనెల 6 నుంచి పత్తా లేకుండా పోయింది. సూపర్‌వైజర్‌కు గాని, సీడీపీఓకు గాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు డుమ్మా కొట్టింది. దీనిపై 'సాక్షి'లో బుధవారం 'పత్తాలేని అంగన్‌వాడీ కార్యకర్త' శీర్షికతో కథనం వెలువడింది. ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. పీడీ శ్రీదేవి ఆదేశాల మేరకు సీడీపీఓ ధనలక్ష్మి కేంద్రానికి వెళ్లి, రికార్డులను పరిశీలించారు. ఈనెల 6న ఉదయం కేంద్రానికి వచ్చిన కార్యకర్త సంతకం చేసేసి వెళ్లిపోయినట్లు గుర్తించారు. 7వ తేదీ కూడేరులో ప్రాజెక్ట్ మీటింగ్ జరిగితే మీటింగ్‌కు హాజరుకాలేదు. 9వ తేదీ సూపర్‌వైజర్ హేమలత కేంద్రానికి వచ్చారు. ఆ సమయంలోనూ వర్కర్ లేదు. కనీసం సమాచారం ఇవ్వకుండా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణను గాలొకొదిలేసిన వైనంపై కలెక్టర్ సీరియస్ అయినట్లు తెలిసింది. సీడీపీఓ నివేదికను పీడీకి అందజేశారు. కాగా అంగన్‌వాడీ కార్యకర్త త్రివేణి అలసత్వంగా విధులు నిర్వహిస్తోందని చిన్నారుల తల్లులు, బంధువులు ఆరోపించారు. ఈమె నిర్వాకంపై పలువురు గ్రామస్తులు సీడీపీఓ, పీడీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.